www.prajasakti.com

ప్రజాశక్తి


గురువారం 2 మే 2024 | 8 పేజీలు

ఏలూరు | పశ్చిమ గోదావరి





పథకాల చుట్టూనే అంతా



ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌ను పరిచయం చేస్తున్న సిఎం జగన్

కూటమి మేనిఫెస్టో డ్రామా అంటూ విమర్శలు

జిల్లా, స్థానిక నియోజకవర్గ సమస్యలపై ఒక్కమాట కరువు

ఏలూరు స్మార్ట్ సిటీ, అభివృద్ధిపైనా మౌనమే

ఏలూరు పర్యటనలో సిఎం జగన్ ప్రసంగంపై చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరు సిటీ, అర్బన్

ఏలూరులో బుధవారం జరిగిన ఎన్నికల సభలో వైసిపి అధ్యక్షుడు, సిఎం జగన్ ప్రసంగమంతా తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల చుట్టూనే సాగడం మినహా, జిల్లా, స్థానిక నియోజకవర్గ సమస్యలపై ఒక్క మాట మాట్లాడకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల పర్యటనలో భాగంగా సిఎం జగన్ గురువారం ఏలూరులో పర్యటించారు. సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక సిఆర్‌ఆర్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం గుండా ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో గడిచిన 59 నెలలుగా అమలు చేసిన అమ్మఒడి, విద్యా, వసతిదీవెన, ఆసరా, చేయూత, చేదోడు, పింఛన్ వంటి పథకాలపైనే ప్రసంగమంతా సాగింది. వైసిపి అధికారంలోకి వస్తేనే పథకాలు అమలు అవుతాయని, చంద్రబాబు ప్రభుత్వం వస్తే పథకాలు ఆగిపోతాయని చెప్పుకొచ్చారు. 2014 ఎన్నికల్లో ఇదే కూటమి ఇచ్చిన హామీల్లో ఏఒక్కటీ అమలు చేయలేదని, ఇప్పుడు మళ్లీ మేనిఫెస్టో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. 2014లో టిడిపి మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను చదివి వినిపించి ఏఒక్కటైనా అమలుచేశారా అంటూ చేతులు ఎత్తి తెలపాలన్నారు. మీ కుటుంబానికి మంచి జరిగిందో.. లేదో ఆలోచించి ఓటువేయాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలపై విమర్శలు, తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపైనే 45 నిమిషాలపాటు ప్రసంగం సాగింది. ఏలూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా చేస్తామని ఇచ్చిన హామీపై ఒక్క మాట మాట్లాడలేదు. ఏలూరులో రోడ్లు, అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను ప్రస్తావించలేదు. టిడ్కో ఇళ్లు అందిస్తామని చెప్పినా దాని ప్రస్తావనా లేదు. ఏలూరు వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆళ్ల నాని సైతం సభలో మాట్లాడలేదు. ఏలూరు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తలేదు. అంతేకాకుండా గత ఎన్నికల్లో జిల్లాకు వైసిపి అనేక హామీలను గుప్పించింది. ఆక్వాసాగుతో తాగునీరు వనరులు కలుషితమైపోయాయని, గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా సురక్షిత తాగునీరు ఇస్తామని చెప్పినా చేయలేదు. పక్కనే ఉన్న చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకం రైతులకు న్యాయమైన పరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా పట్టించుకోలేదు. పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని చెప్పినా జరగలేదు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితులకు రూ.పది లక్షల పరిహారం, 2006కు ముందు సేకరించిన భూములకు ..6లో



తాడేపల్లిగూడెంలో సిఐటియు ఆధ్వర్యాన భారీ ప్రదర్శన

అరుణారుణం

అంబరాన్నంటిన మేడే సంబరాలు

వాడవాడలా మేడే పతాకావిష్కరణలు

ర్యాలీల్లో కదంతొక్కిన కార్మికులు

కార్మిక చట్టాలు యథాతథంగా కొనసాగించాలని నినాదాలు జిల్లాలో మేడే సంబరాలు అంబరాన్నంటాయి. వాడవాడలా మేడే పతాకావిష్కరణలతో ఎర్రజెండా రెపరెపలాడింది. కార్మికులారా ఏకంకండి అనే నినాదంతో కార్మికలోకం కదంతొక్కింది. కార్మికుల హక్కులను కాల రాయాలని చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రాబోయే రోజుల్లో గద్దె దింపుతామని కార్మికలోకం హెచ్చరించింది. రక్తం చిందించి సాధించుకున్న హక్కులను హరిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని నినదించారు. కార్మిక చట్టాలు, హక్కులను రక్షించు కునేందుకు ఐక్యపోరాటాలు ఉధృతం చేయాలని ప్రతినబూనారు. లోపలి పేజీల్లో..



ఆకివీడులో మాట్లాడుతున బలరాం



ఏలూరులో జెండాను ఆవిష్కరించిన రవి

ఎటిడబ్ల్యుఒ కృష్ణమోహన్ సస్పెన్షన్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతిగృహంలో ఫిబ్రవరిలో కలుషిత ఆహారం తిని 40 మంది విద్యార్థులకుపైగా అస్వస్థతకు గురవ్వడానికి బాధ్యుడైన అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె.కృష్ణమోహన్‌ను సస్పెండ్ చేసినట్లు ఐటిడిఎ ఎంపిఒ పివిఎస్.నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం, వసతిగృహాలపై పర్యవేక్షణలో అలసత్వం, మెస్ బిల్లుల్లో అవకతవకలకు తదితర కారణాల రీత్యా ఉన్నతాధికారులు ఈ చర్య చేపట్టారని పేర్కొన్నారు. ఆయన స్థానంలో జంగారెడ్డిగూడెం బాలికల వసతిగృహానికి చెందిన జి.జనార్ధనరావును జీలుగుమిల్లి ఎటిడబ్ల్యుఒగా నియమించినట్లు తెలిపారు.

భర్త చేతిలో భార్య హత్య

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త భార్యను హత్య చేసిన ఘటన మండలంలోని శ్రీనివాసపురం బాబ్జీ నగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బర వంశీకి, ఝాన్సీ దంపతులకు 19 సంవత్సరాల క్రితం వివాహమైంది. వృత్తిరీత్యా వంశీ తాపీమేస్త్రీ. చెడు వ్యసనాలకు బానిసైన వంశీ తరచూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఝాన్సీ జంగారెడ్డిగూడెంలో ఒక ప్రయివేట్ హాస్పిటల్లో ఆయాగా పని చేస్తుంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండు ..6లో



రక్తపు మడుగులో ఝాన్సీ

సమస్యల సమాహారం.. భీమవరం

మధ్యపేజీల్లో..

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

7లో..

రాజ్యాధికారం కార్మికవర్గ చేతుల్లోకి రావాలి : బలరాం

8లో..

పారదర్శకంగా ఇవిఎంల రెండో ర్యాండమైజేషన్

జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా రెండోదశ ఇవిఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్ సమక్షంలో నిర్వహించిన రెండోదశ ఇవిఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియకు పలువురు అభ్యర్థులు, వారి ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఇవిఎంల ..6లో



పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

3న సిఎం జగన్ నరసాపురం రాక

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ నెల మూడో తేదీన నరసాపురంలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని మెయిన్ రోడ్డులో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జరిగే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. తొలుత పట్టణంలోని టేలర్ హైస్కూల్ గ్రౌండ్లో హెలికాప్టర్ దిగి అక్కడ నుండి రోడ్డు మార్గాన మెయిన్ రోడ్డుకు చేరుకుని ప్రసంగిస్తారు. హెలీప్యాడ్ స్థలాన్ని రాష్ట్ర చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, నాయకులు బుధవారం పరిశీలించారు.

'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో కొత్తశకం'

ప్రజాశక్తి - కామవరపుకోట

దేశంలోనే మొట్ట మొదటిసారిగా వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో రాష్ట్రంలో భూముల చరిత్రలో కొత్త శకం నమోదైందని ఏలూరు జిల్లా ఎస్‌సి, ఎస్‌టి కేసుల విజిలెన్స్ కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్ అన్నారు. భూ యజమానులకు భరోసా ఇచ్చే ఈ చట్టాన్ని తేవడానికి దేశంలోని పలు రాష్ట్రాలు చాలా ఏళ్లుగా చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదని తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో దీన్ని సాధ్యం చేసి చూపించిందన్నారు. అత్యంత సంక్లిష్టమైన భూ హక్కుల చట్టం తెచ్చిన మొట్టమొదటి రాష్ట్రంగా చరిత్ర సృష్టించిందన్నారు. ఈ చట్టం అమలైతే 30 రకాల భూముల రికార్డుల స్థానంలో ఒకే ఒక టైటిల్ రిజిస్టర్ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరిశెట్టి గూడెం సర్పంచి దేవరపల్లి రామ్మోహన్ రావు, ఎంపిటిసి బొప్పన చైతన్య పాల్గొన్నారు.

జగన్ హయాంలో 50 ఏళ్లు వెనక్కి..

సమత సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

గత ఐదు సంవత్సరాల్లో దళితులను 50 ఏళ్ల వెనక్కి నెట్టిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అని సమత సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు అన్నారు. చింతలపూడి పట్టణంలో టిడిపి పార్టీ కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో ఒక్కసారి కూడా దళిత, ప్రజా సంఘాలను కలవని ఏకైక సిఎం జగన్ అని అన్నారు. అంబేద్కర్ ఇచ్చిన ఓటు అనే ఆయుధం ద్వారా దళితులంతా కలిసి జగన్‌ను ఓడించాలని సైనిక్ దళ్ నుంచి కోరారు. ఎస్‌సి వర్గీకరణకు సమత సైనిక్ దళ్ మద్దతు ఇవ్వటం లేదన్నారు. కృష్ణ జిల్లా అధ్యక్షులు సిద్ధం అశోక్, ఏలూరు జిల్లా అధ్యక్షులు మణిరాజు, విజయ్ పాల్గొన్నారు.

ఏలూరు సిటీ: నవరత్నాల కోసం ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులను వాడుకొని, నిలువునా ఎస్‌సిలందరిని జగన్ మోసం చేశాడని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు అన్నారు. శ్రీమాన్య గెస్ట్ లైన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27 పథకాలను రద్దు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని విమర్శించారు.

'మానవత' ఆధ్వర్యాన చలివేంద్రం ఏర్పాటు

భీమడోలు: అటు ప్రయాణికులు, ఇటు వాహనదారులతో పాటు పలువురు ప్రజలు సంచరించే భీమడోలు జంక్షన్ వంటి కీలక ప్రాంతాల్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థ భీమడోలు మానవత శాఖ సేవలు అభినందనీయమని ఆ సంస్థ శాంతిరథాల విభాగం జిల్లా ఛైర్మన్ అప్పక రాంబాబు అన్నారు. భీమడోలు జంక్షన్‌లోని రూపక దేవాలయం ప్రాంతం వద్ద మానవత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం, మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ జిల్లా సమన్వయకర్త రామిశెట్టి గంగాధర రావు, భీమడోలు శాఖ ఛైర్మన్ జి.నూకరాజు మాట్లాడారు. మజ్జిగ సమకూర్చిన దాత గోనుగుంట రమణ శంకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల ప్రతిభపై అవగాహన పెంచుకోవాలి

మండవల్లి: విద్యార్థులు అందిపుచ్చుకునే ధోరణి అలవాటు చేసుకోవాలని, అప్పుడే మంచి భవిష్యత్ ఉంటుందని మోటివేషనల్ స్పీకర్ మేడిశెట్టి కళ్యాణ్ స్పష్టం చేశారు. భైరవపట్నం శుభం ఫంక్షన్ హాల్లో రాయల్ క్లబ్ కైకలూరు సుధామ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ సుధా బత్తుల విజయ్ కుమార్ అధ్యక్షతన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాల ప్రణాళికపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు, తల్లిదండ్రులకు బుధవారం అవగాహన కలిగించారు. విద్యార్థులు తమ ప్రతిభపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ కప్ కైకలూరు సెక్రటరీ రామిశెట్టి విజయకుమార్, ట్రెజరర్ ఆచంట వెంకటరత్నం పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురు

ముసునూరు: పథకాల అమలు కావాలంటే మరలా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైసిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. బుధవారం నూజివీడు వైసిపి కార్యాలయంలో ముసునూరు గ్రామానికి చెందిన యాదవ సోదరులు సంఘ పెద్దలు 20 కుటుంబాలు ముద్దరబోయిన వర్గీయులు వైసిపిలోకి చేరారు. రేకుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో తులిమెల్లి సుబ్బారావు, గూంటు రంగారావు, తదితరులు చేరారు.

కలప పట్టివేత

కుక్కునూరు: రూ.లక్ష 10 వేల విలువగల మారుజాతి(నకిర) కలపను అటవీ శాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఏలూరు జిల్లా కుక్కునూరు మండల పరిధిలోని మారేడుబాక అటవీ ప్రాంతంలోని నకిరా, కోడిస కలపను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు

ఉండి: పాములపర్రులో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే పాలకోడేరు మండలం శృంగవృక్షం నుంచి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి ఉండి మండలం ఎండగండి మీదుగా కాళ్ళకూరు వెళుతుండగా మార్గమధ్యలో పాములపర్రు వచ్చేసరికి ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు యువకుల మోటార్ సైకిల్‌ను వెనుక వస్తున్న ఆటో ఢీకొనడంతో వారు పక్కనే ఉన్న మురుగు కాలువలోకి దూసుకుపోయారు. ఆటోలో ఉన్నావారికి గాయాలయ్యాయి.

ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు



కలిదిండిలో సిఐటియు ఆధ్వర్యాన జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

కార్మిక హక్కుల సాధన, 8 గంటల పని విధానం కోసం మే డే ఆవిర్భవించిందని, మే డే స్ఫూర్తిని కాపాడుకోవడం ద్వారానే కార్మికుల హక్కులు రక్షించబడతాయని సిఐటియు పూర్వ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసింహారావు అన్నారు. ఉంగుటూరు, చేబ్రోలు, నారాయణపురం, కైకరం తదితర గ్రామాల్లో సిఐటియు జెండాలను ఆవిష్కరించి అనంతరం ఆయన మాట్లాడారు. సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, భాస్కరరావు పాల్గొన్నారు.



నిడమర్రులో..

చాట్రాయి: వ్యవసాయ కూలీల పని గంటల ప్రకారం కూలీ రేట్లు ఇవ్వాలని పోరాడిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని చాట్రాయి మండల సిఐటియు నాయకురాలు మేడేపల్లి హెూలీ మేరీ అన్నారు. మండల కేంద్రమైన చాట్రాయి సెంటర్‌లో సిఐటియు, సిపిఎం జెండాలను ఆవిష్కరించారు. చిన్నంపేట గ్రామంలో మేడే సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పంపిణీ చేశారు. చనుబండ గ్రామంలో సిపిఎం మండల నాయకులు గజవెల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, పోలవరం గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకులు చాగంటి రాజారావు ఆధ్వర్యంలో సిఐటియు, సిపిఎం జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు నెల్లూరి మురళీ, గంధం రాజేష్, వెంకన్న, బాబురావు, లింగయ్య పాల్గొన్నారు.

కామవరపుకోట: భారతదేశంలోనే కాక ప్రపంచ కార్మిక ఉద్యమానికి నాయకత్వం వహించిన ఘనత, ప్రపంచ కార్మిక సంఘాల్లో ఎఐటియుసికి ఒక ప్రత్యేక స్థానం ఉందని సిపిఐ మండల కార్యదర్శి టివిఎస్.రాజు అన్నారు. చౌతన సెంటర్‌లో ఆయన సిపిఐ పతాకం ఆవిష్కరించారు. కొత్తూరు ముఠా వర్కర్ సీనియర్ కార్యాలయం వద్ద ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు చాలమాల శ్రీనివాసరావు, మీనుగుల దుర్గారావు, టి.రాములమ్మ, రేష్మి వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో..

నిడమర్రు: మండలంలోని నిడమర్రు, పెద నింద్రకొలను, భువనపల్లి, బావయ్యపాలెం, చానమిల్లి, అడవికొలను గ్రామాల్లో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, అంగన్వాడీలు, ఆశాలు అంతర్జాతీయ మేడే దినోత్సవం నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు ఎర్రజెండా ఎగురవేశారు. పిల్లా హరి కుమారి, చిన్నిమిల్లి రాంబాబు, ఆసుపూ హరిప్రసాద్, కానూరు శ్రీను, నిమ్మల పార్వతి, కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: మండలం వ్యాప్తంగా ప్రపంచ కార్మిక దినోత్సవ(మేడే) వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో జెండాను మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు ఆవిష్కరించారు. లక్ష్మీపురం గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రమణ, కుటుంబరావుల అధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, నాయకులు సీతారామయ్య, దానియేలు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ: మార్కెట్ యార్డు హమాలీ వర్తక సంఘం యూనియన్ ప్రెసిడెంట్, జనసేన ఏలూరు ఇన్‌ఛార్జి రెడ్డి అప్పల నాయుడు ఆధ్వర్యంలో ఏలూరులో ఘనంగా మేడే దినోత్సవం నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లోని ఐఎఫ్‌టియు కార్యాలయం వద్ద, ఏలూరు వన్ టౌన్ మార్కెట్ సెంటర్, హమాలీ కాలనీలో, చెంచుల కాలనీ సెంటర్‌లో, మేదర్ల, ఆశ్రమం హాస్పిటల్ హైవేలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు, హమాలి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మండవల్లి: శ్రమజీవులంతా ఐక్యమై పోరాడి సాధించుకున్న త్యాగఫలమే మేడే అని సిఐటియు ప్రాజెక్ట్ లీడర్ చల్లాయమ్మ అన్నారు. మేడేను పురస్కరించుకుని స్థానిక సెంటర్‌లో ఆమె కార్మికులతో కలిసి ఎర్రజెండాను బుధవారం ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి పాల్గొన్నారు.

కైకలూరు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మేడే సందర్భంగా అరుణ పతాకం రెపరెపలాడింది. ఎన్నికల సీజన్ కావడంతో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్మికులతో కలిసి ఎర్రజెండాను ఎగరవేశారు. కైకలూరులో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్, వైసిపి అభ్యర్థి దూలం నాగేశ్వరావులు కార్మిక సంఘాలతో కలిసి మేడే వేడుకల్లో పాల్గొన్నారు. ఇండియా కూటమి అభ్యర్థి బొడ్డు నోబుల్ కలిదిండి మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన మేడే వేడుకల్లో పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని డాక్టర్ ఎంఆర్‌ఎఫ్ అప్పారావు కాలనీలో మేడే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్మిక జెండా ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఐఎఫ్‌టియు ఏలూరు జిల్లా కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

టి.నరసాపురం: మండలంలో మేడే సంబరాలు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో జెండా చెట్టుకు సిఐటియు జెండాను నాయకులు తుమ్మల సత్యనారాయణ ఆవిష్కరించారు. మండలంలోని మెట్టగూడెం, చిన్న గురువాయుగూడెం, గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులు సంఘం ఆధ్వర్యంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు నగర్, రామమ్మ గూడెం, ఉపాధి పని ప్రదేశాల వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. మండలంలోని మక్కిన వారిగూడెంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో ముఠావర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లెల సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్ ఎర్ర జెండా ఎగుర వేసారు. ఈ కార్యక్రమాల్లో ఎఐటియుసి చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షుడు కొండముచ్చు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: ఏలూరు నగరంలో వివిధ ప్రాంతాల్లో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆశ్రమం మెడికల్ కాలేజీ దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సూరిబాబు, జె.గోపి మాట్లాడారు. రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కర్రవంతెన స్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.



కొయ్యలగూడెంలో..

ద్వారకాతిరుమల: మేడే సందర్భంగా మండలంలోని ఎన్నాగులపల్లి, పాత పంచాయతీ కార్యాలయం వద్ద సిపిఎం పతాకాన్ని సిపిఎం మండల నాయకులు కట్ట భాస్కరరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షక హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. యుటిఎఫ్ బిల్డింగ్ వద్ద యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు.

ముసునూరు : కార్మిక, కర్షక, రైతు బంధువులకు పెద్ద పండుగ మేడే అని ముసునూరు మండల సిపిఎం కార్యదర్శి పిల్లి మురళీ అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లిపాము కుటుంబరావు, కంచర్ల దుర్గారావు, కంచర్ల మురళీ, కంచర్ల బుజ్జి, కంచర్ల రమేష్, కంచర్ల శ్రీను, పిన్నిబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మేడే వేడుకలు ఆగిరిపల్లిలోని సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆగి రిపల్లిలోని సిఐటియు కార్యాలయం, సబ్‌స్టేషన్, మెయిన్ సెంటర్, గొల్లగూడెంలోని కుశలవ ఇంటర్నేషనల్ కంపెనీ, అంబేద్కర్ నగర్ వద్ద మేడే సందర్భంగా సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆగిరిపల్లి మండల కార్యదర్శి ఆర్.చంటి, ఎం.నరేష్, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కలిదిండి : మేడేని పురస్కరించుకొని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎఎంసి కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, ప్రధాన సెంటర్‌లో సిఐటియు మండల అధ్యక్షులు షేక్ అబిదా బేగం, బిల్డింగ్ వర్కర్స్ మండల అధ్యక్షులు పోతురాజు బాలాజీ, మూలలంకలో డ్రైవర్స్ సంఘం ఉపాధ్యక్షులు తంగెళ్ల గణపతి ప్రసాద్, రామకృష్ణా పురంలో మహిళా సంఘం మండల కార్యదర్శి ఎస్.మహాలక్ష్మి, గుర్వాయిపాలెంలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు చిన్నం శ్రీకాంత్, చిన తాడినాడలో వ్య.కా.స నాయకులు అద్దాని వెంకటేశ్వరరావు ప్రజాసంఘాల జెండాలను ఎగురవేశారు.

కొయ్యలగూడెం : సిఐటియు ఆధ్వర్యంలో గవర్నమెంట్ హాస్పటల్ వద్ద మేడే దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు ఎస్.శివరత్నకుమారి, జె.నాగవేణి, శ్రీదేవి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం పట్టణంలో సిపిఐ కార్యాలయం వద్ద మేడేను ఘనంగా నిర్వహించారు. జమ్మి శ్రీనివాసరావు ముందుగా సిపిఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో తాడిగడప ఆంజనేయరాజు, ఎస్‌కె బాజీ పాల్గొన్నారు.

బుట్టాయిగూడెం: మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షురాలు పుష్ప సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు తెల్లం రామలక్ష్మి, కృపామణి, మంగతాయారు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో బుధవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద, గురజ రోడ్డు సెంటర్లో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో నేతలు ఎస్.అరుణ, బి.పద్మ, చిన్న మాధవ పాల్గొన్నారు.

కుక్కునూరు : కార్మికవర్గ పోరాట దీక్ష దినం మేడే పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం అని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. బుధవారం జిసిసి కార్యాలయం నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, హమాలి, బిల్డింగ్, అంగన్వాడీ, యాణిమేటర్, సిఐటియు కార్యాల యంలో జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు మండల అధ్యక్షులు కుంజ నాగలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం

కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ఉదయ భాస్కర్ కృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వాలు క్రీడలపై నిర్లక్ష్యం వహించాయని కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయభాస్కర్ కృష్ణ ప్రసాద్ (బుజ్జి) అన్నారు. బుధవారం పట్టణంలోని టేలర్ హైస్కూల్ గ్రౌండ్‌లో క్రీడాకారులను కలిశారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడా ప్రాంగణాలు అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే క్రీడా ప్రాంగణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడల్లో ప్రత్యేక ప్రతిభ చూపిన వారికి క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. హస్తం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుబ్బల కృష్ణారావు, మల్లిపూడి శ్రీను, పోలిశెట్టి బాబ్జి, చేగొండి బాలాజీ, సోడదాసి శ్రీధర్, వినుకొండ రమేష్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఉదయభాస్కర్ కృష్ణ ప్రసాద్

ఆచంటలో చెరుకువాడ ప్రచారం

ప్రజాశక్తి - ఆచంట

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పాలన కొనసాగించిన సిఎం జగన్మోహన్ రెడ్డికి ప్రజల ఆశీస్సులు ఉన్నాయని వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట పంచాయతీ చిన్నపేట, కొత్తూరు సెంటర్, కాపులపాలెం, బొంతువారిపాలెం, మానేవారిపాలెం, కానుపోతుగుంట, రావిగుంట, బాలవారిపాలెం, కసరత్తుగుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం బుధవారం సాయంత్రం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో నవరత్నాల పేరిట ఇచ్చిన వాగ్దానాలతో పాటు ఇవ్వని హామీలు కూడా నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగేందుకు ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి ఎంఎల్ఎగా తనను, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచులు సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, ఉల్లం జ్యోతి రామాంజనేయులు, మట్టా ఆనంద్‌కుమార్, వెంకట్రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆచంటలో ప్రచారం చేస్తున్న చెరుకువాడ శ్రీరంగనాథరాజు

శ్రీరంగనాథరాజు తనయుడి ప్రచారం

పెనుగొండ: జగనన్న సంక్షేమ పథకాలు చూసి మరోసారి ఓటువేసి ఆశీర్వదించాలని వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ రంగనాథరాజు తనయుడు నరేష్‌రాజు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పెనుగొండలో లింగాల వీధి, శివాలయం వీధి గుబ్బలవారి వీధిలో ఇంటింటా తిరుగుతూ వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సూర్యకుమారి

రామానాయుడును మరోసారి ఆశీర్వదించండి


ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలనూ కుటుంబంగా భావించే ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని నిమ్మల సూర్యకుమారి కోరారు. పూలపల్లి గ్రామంలో బుధవారం ఆమె టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నిమ్మల రామానాయుడును గెలిపిస్తే మరో ఐదేళ్లపాటు అభివృద్ధితోపాటు అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమం చూస్తారని సూర్యకుమారి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అమలు జరిగే సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, వేగేశ్న శ్రీహరిరాజు, గుబ్బల ప్రసాద్, గోనెడ రామకృష్ణ, ఉనికిల నాగేశ్వరరావు, గబ్బిడి నరసింహారావు, నున్నబోయిన నాగరాజు, పాలపర్తి చాంద్ రాజ్, గుడిసె సురేంద్ర, పాలపర్తి షాజహాన్, బొంతు పద్మ, గూడూరి మల్లేశ్వరి, బి. సత్యవతి, తాళ్లూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

గవరపేటలో మంగతాయారు ప్రచారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం గవరపేట గ్రామంలో వైసిపి అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు భార్య మంగతాయారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి తన భర్తను గెలిపించాలని, ఎప్పుడూ అందుబాటులో ఉండే వ్యక్తిని గెలిపించి ఆదరించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పొలిమేర వెంకటేశ్వరరావు, గ్రామ స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న మంగతాయారు

అక్రమ మద్యం సరఫరా, నిల్వలపై విస్తృత తనిఖీలు

జిల్లా మద్యం నిషేధ అబ్కారీ అధికారి గౌరీ శంకర్‌రావు

ప్రజాశక్తి - భీమవరం

ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అక్రమ మద్యంపై ఎక్సైజ్, ఎస్ఇబి బృందాలు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు జిల్లా మద్య నిషేధ అబ్కారీ అధికారి ఆర్.శంకరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన చేశారు. మద్యం సరఫరా చేసే వాహనాలకు జిపిఎస్ డివైస్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి వాటి మార్గం గమనించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఎస్ఇబి 887 కేసులు నమోదు చేసి 847 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాగే రూ.41,66,801 విలువచేసే, 13,223 లీటర్ల మద్యాన్ని సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా, సరఫరా చేసినా, బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో టోకెన్ ఇచ్చి మద్యం అమ్మినా కంట్రోల్ రూమ్ నంబర్ 9491420699కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు.



సార్వత్రిక సంగ్రామం

సమస్యల సమాహారం.. భీమవరం

రెండో బార్డోలిగా పేరొందిన భీమవరం సమస్యలకు నిలయంగా మారింది. క్విట్ ఇండియా ఉద్యమానికి నాంది పలికిన ఈ ప్రాంతం అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉంది. ఎంతోమంది రాజకీయ ఉద్ధండులు, మరెంతోమంది స్వతంత్ర, కమ్యూనిస్టు పోరాటయోధులు, ఇంకా ఎంతో మంది శాస్త్రవేత్తలు, ప్రముఖ వైద్యులు, కళారంగం, రంగస్థల నటులు నడయాడిన నేలలో సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా భీమవరం అభివృద్ధిపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఎన్నికల్లో ఓట్ల కోసం ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో నియోజకవర్గ ప్రజానీకం విమర్శలు గుప్పిస్తున్నారు.



మత్స్యపురిలో తాడిచెట్లతో తాత్కాలిక వంతెనను నిలబెట్టుకుంటున్న రైతులు

- పాలకులు మారుతున్నా అభివృద్ధి అంతంత మాత్రమే
- భూ సేకరణతోనే మరుగునపడ్డ డంపింగ్ యార్డు
- నాలుగు వంతెనలకు కలగానే మిగిలిన అప్రోచ్ రోడ్లు నిర్మాణం
- అసంపూర్తిగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణం
- ఐదేళ్లలో ఇచ్చిన హామీలు అమలుపై నీలి నీడలు
- ఆందోళనలో భీమవరం నియోజకవర్గ ప్రజలు

ఫోకస్

ప్రజాశక్తి - భీమవరం, వీరవాసరం, భీమవరం రూరల్

విద్య, వైద్య, వ్యాపార రంగాల్లో విరాజిల్లుతున్న పట్టణాల్లో భీమవరం ఒకటి. ఈ ప్రాంతం తెలియని వారంటూ ఎవరూ ఉండరు. నూతన జిల్లా ఏర్పాటుతో భీమవరం పట్టణం ఆర్థిక రాజధానిగా విరాజిల్లుతోంది. అన్ని రంగాలతోపాటు రాజకీయంగా ఎంతో పేరొందింది. అయితే ఐదేళ్లకోసారి జరుగుతున్న ఎన్నికల్లో పోటీ పడుతున్న ప్రభుత్వాలు, పాలకులు, ఇచ్చిన హామీలు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత సాధారణ ఎన్నికల్లో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా సెట్టింగ్ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, జనసేన అభ్యర్థిగా పులపర్తి రామాంజనేయులు పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రధానంగా పట్టణ ప్రజలు ట్రాఫిక్ సమస్యతో నిరంతరం సతమతమవుతున్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది. అయితే భీమవరం పట్టణ రూపురేఖలు మార్చేందుకు బృహత్తర ప్రణాళిక రచించినప్పటికీ అది కాగితాలకే పరిమితమైంది. యనమదుర్రు కాలువపై నాలుగు వంతెనలు ఏర్పాటు చేసి దశాబ్ద కాలం అవుతోంది. అయితే వాటికి అప్రోచ్ రోడ్లు నిర్మించడంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ విఫలమయ్యారు. గతంలో ఈ వంతెనలకు ఒక్కో దానికి రూ.5 కోట్లు చొప్పున ఖర్చు చేశారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు చేసి టెండర్లు పిలిచినా ఫలితం శూన్యం. 2009 నుంచి 2014 వరకూ రెండు సార్లు ప్రస్తుత జనసేన అభ్యర్థి అంజిబాబు ఎంఎల్ఎగా పనిచేశారు. తర్వాత ప్రస్తుత వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్ఎ గ్రంధి వీరివురూ వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించడంలో నిర్లక్ష్యం వహించారు.



డంపింగ్ యార్డుగా మారిన యనమదుర్రు గట్టు

నీటి మూటగా మిగిలిన డంపింగ్ యార్డు నిర్మాణం

భీమవరం పట్టణాన్ని వేధిస్తున్న మరో సమస్య డంపింగ్ యార్డు. పెరుగుతున్న జనాభాలాగే పట్టణంలో చెత్త కూడా టన్నుల కొద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డంపింగ్ యార్డు సమస్యపై పదేపదే ప్రస్తావించారు. అయితే ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమస్యపై పట్టించుకున్న దాఖలాలు లేవు. తాడేరు ప్రాంతంలో ఆరెకరాల భూమిని డంపింగ్ యార్డు కోసం సేకరించినట్లు ఎంఎల్ఎ గ్రంధి ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకూ అతీగతీలేదు. తాడేరు వంతెన సమీపంలో గత టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల పంపిణీ కూడా నామ మాత్రం గానే చేశారు. 9 వేల గృహాలు నిర్మిస్తే కేవలం మూడు వేల గృహాలు మాత్రమే పంపిణీ చేశారు. అవికూడా పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టకుండా కనీసం మౌలిక వసతులు కల్పించకుండా హడావుడిగా పట్టాలు పంపిణీ చేసి గృహ ప్రవేశాలు చేయించారు. ఈ గృహ సముదాయాల్లో సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు అనేకసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోని పరిస్థితి. గ్రంధి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు నాలుగెకరాల స్థలాన్ని వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించారు. అయితే సుమారు రూ.ఐదు కోట్లతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు.



బాలేపల్లి వద్ద వీరవాసరం లబ్ధిదారులకు కేటాయించిన జగనన్న లేఅవుట్

వీరవాసరంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరం..

వీరవాసరం మండలంలో ముఖ్యంగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. రైతాంగ సమస్యలపై ఎప్పటికప్పుడు సిపిఎం ఆధ్వర్యంలో అధికారులకు, నాయకులకు ఎత్తిచూపిస్తున్నా పరిష్కరించే నాధుడే కానరావడం లేదు. బ్రిటీష్‌కాలం నాటి నుంచి రైతులకు ఎంతో ఉపయోకరంగా ఉండే పుంత రోడ్లు ప్రస్తుతం దయనీయంగా మారాయి. రైతులు పండించిన ధాన్యాన్ని గ్రామంలోకి చేర్చుకోవాలంటే రైతులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. భీమవరం - నరసాపురం ఆర్ అండ్ బి మార్గంలో మత్స్యపురి వద్ద తొక్కోడుపై ఉన్న తూరల వంతెన స్థానంలో శ్లాబ్ వంతెన నిర్మాణం అవసరమని గుర్తించినా ఇంతవరకూ నాయకులు వాగ్దానాలకు మాత్రమే పరిమితమైంది. ఈ తూరల వంతెన వల్ల వీరవాసరం మండలంలో మత్స్యపురి, మెంటేపూడి, బాలేపల్లి, బొబ్బనపల్లి, నందమూరుగరువు గ్రామాలకు చెందిన ఆయకట్టు తరచూ ముంపునకు గురవ్వడంతో రైతులు నష్టపోతున్నారు. అదేవిధంగా ఈ డ్రెయిన్‌పై మత్స్యపురి నడిపుంత మార్గంలో వంతెన నిర్మించాల్సి ఉంది. ఈ గ్రామానికి చెందిన కొంత ఆయకట్టు డ్రెయిన్ అవతల వైపు ఉండడం వల్ల రైతులు తమ పంటను గ్రామానికి చేర్చుకోవడంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు ఐదు కిలోమీటర్లు చుట్టూ తిరిగి కంసాలబేతపూడి మీదుగా తమ పంటను తెచ్చుకోవడం వల్ల అధిక కిరాయిలు చెల్లించాల్సిన పరిస్థితి. దీంతో రైతులు తాత్కాలిక అవసరాల కోసం తాడిచెట్లతో వంతెన ఏర్పాటు చేసుకుని తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇక్కడ వంతెన అవసరం నాయకులకు తెలిసినా దాని నిర్మాణానికి ముందుకు రాని పరిస్థితి. ప్రస్తుతం ఈ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కోటిపల్లి బాబు భీమవరం మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా రైతుల సమస్యలు తీరే పరిస్థితి కానరావడం లేదు. అలాగే నవుడూరు వద్ద పాలమూరు డ్రెయిన్ రైతులను పట్టిపీడిస్తోంది. సిపిఎం అనేక దఫాలుగా ఆందోళన చేసి పొలమూరు డ్రెయిన్‌ను ప్రక్షాళన చేయాలని కోరినా పాలకులు, అధికారులు పట్టించుకోని పరిస్థితి.

పూర్తికాని అంతర్గత డ్రెయినేజీ పనులు

వీరవాసరంలో అంతర్గత డ్రెయినేజీ సమస్య ముందుకు సాగని పరిస్థితి ఉంది. గత ఎన్నికల్లో గ్రంధి శ్రీనివాస్ ప్రధాన హామీగా ఉంది. హామికి తగ్గట్టుగానే రూ.12 కోట్లతో డ్రెయినేజీ పనులు ప్రారంభించినా పూర్తికాని పరిస్థితి. ఈ గ్రామంలో శ్మశానవాటిక అభివృద్ధి కానరావడం లేదు. వీరవాసరంలో సీసీ రోడ్ల అభివృద్ధికి మండల పరిషత్ నుంచి సుమారు రూ.నలభై లక్షలు కేటాయించినా పనులు ప్రారంభించడానికి పంచాయతీ పాలకవర్గం అందుకు అవసరమైన తీర్మానాలు ఇవ్వకపోవడం గమనార్హం. అలాగే బాలేపల్లి గ్రామం సమీపంలోని జగనన్న లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. అనువుగా లేని చోట స్థలాలు కేటాయించడం పట్ల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బతుకుతెరువు ఉన్నచోట కాకుండా పశువుల పాకలు కూడా వేసుకోని చోట ఇళ్ల స్థలాలు ఏ విధంగా కేటాయించారంటూ అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. ఇప్పటికే మండలంలో పంచాయతీల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నా అవి తాగేందుకు పనికిరాని పరిస్థితి లేదు.

చింతలపూడిలో రోషన్‌కుమార్ ప్రచారం

ప్రజాశక్తి - చింతలపూడి

అమ్మఒడి పేరుజెప్పి, నాన్న బుడ్డి పేరుతో డబ్బులు లాగుతునారని వైసిపి ప్రభుత్వంపై టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ విమర్శించారు. పట్టణంలో మోడల్ కాలనీ, ఎన్‌టిఆర్ కాలనీ, మారుతీనగర్, ఎరుకుల బజార్, ముస్లిం బజార్, కోవూరుగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి మేనిఫెస్టోలో కొత్త సీసాలో పాతసారాలా ఉందని తెలిపారు. పవన్‌కళ్యాణ్‌ను దత్తపుత్రడు అంటాడు, మద్యపాన నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానన్నావ్ ముందు మద్యపాన నిషేధం చేయకుండా ఓట్లు ఎలా అడుగుతున్నావని ప్రశించారు. ఏమైంది మందుపుత్రా నీ హామీ అని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి శవ రాజకీయాలు చేస్తాడని విమర్శించారు. మెగా డిఎస్‌పి పేరుతో దగా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిది అన్నారు. సిపిఎస్ రద్దు చేస్తానన్నారని, ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. అభివృద్ధి పాలన కావాలా, అవినీతి పాలన కావాలా ప్రజలు ఆలోచించాలన్నారు. సేవ చేసేవారు కావాలా, అవినీతి చేసేవారు కావాలా ప్రజలు చూసి ఓటువేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు చిదరాల మధు బాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు పక్కల వెంకటేశ్వరరావు, ఐటిడిపి నియోజకవర్గ నాయకులు బోడ అవినాష్ జయపాల్, తాటి అప్పారావు, శేషగిరిరావు, వెంకన్న పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న సొంగా రోషన్ కుమార్

కార్మికులు ఐక్యతను చాటాలి

జంగారెడ్డిగూడెం టౌన్ : మేడే సందర్భంగా టిడిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ జంగారెడ్డిగూడెం భగత్‌సింగ్ సెంటర్ వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉండి కార్మికుల ఐక్యతను చాటాలన్నారు. కార్మికులందరూ సోదరభావంతో పనిచేయాలని, త్వరలో కూటమి ప్రభుత్వం రాబోతోందన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

బిసివై నరసాపురం అభ్యర్థి ఆకుల వెంకటస్వామి

ప్రజాశక్తి - నరసాపురం

తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేస్తామని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి తెలిపారు. మండలంలోని దర్భరేవు, రాజుల్లంక, మర్రితిప్ప, వేములదీవి గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. మార్గ మధ్యంలో పలుకూడళ్లల్లో ఆగుతూ ప్రజల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు వందనం కార్యక్రమం ద్వారా ఆరోగ్య భరోసా, ఆర్థిక భద్రత, ఆత్మ రక్షణ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. డ్వాక్రా గ్రూపులకు రూ.5 లక్షలు వడ్డీలేని రుణాలు అందిస్తామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే జిల్లా కేంద్రం నరసాపురం వచ్చేలా కృషి చేస్తామన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

రామచంద్రయాదవ్‌పై దాడి దారుణం

భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌పై కిరాయి మూకలు దాడిచేయడం దారుణమని, నీచమైన చర్య అని బిసివై నరసాపురం అభ్యర్థి ఆకుల వెంకటస్వామి అన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పుంగనూరు నియోజకవర్గంలో తమ పార్టీ అధ్యక్షుడు కాన్వాయ్‌పై దాడి చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా ప్రచారం చేసుకుంటున్న ఆయనపై దాడి చేయడం ఏంటన్నారు. ప్రజల్లో తమ పార్టీకి వస్తున్న ఆదరణ చూడలేక దాడి చేశారన్నారు. వైసిపి, కూటమి పార్టీల మధ్య లోపాయుక్త ఒప్పందం జరిగిందన్నారు. నరసాపురంలో జిల్లా కేంద్రం తరలివెళ్లినప్పుడు ప్రధాన పార్టీ జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సరైన సమయంలో పోరాటం చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో చెరకు రైతు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. నరసాపురం నియోజకవర్గంలో వైసిపి, బిసివై పార్టీ మధ్య పోటీ అన్నారు. ఇప్పటికైనా ప్రజలు గమనించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న వెంకటస్వామి



గోపాలకృష్ణంరాజుతో కలిసి ప్రచారం చేస్తున్న బాపిరాజు

దేశాన్ని పాలించే సత్తా కాంగ్రెస్‌కే ఉంది

మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

దేశాన్ని పాలించే సమర్థత ఒక కాంగ్రెస్‌కే ఉందని, ఆ పార్టీ నాయకత్వంతో దేశం అభివృద్ధిలో పయనిస్తుందని మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు అన్నారు. కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వెంకట గోపాలకృష్ణంరాజు గెలుపును కాంక్షిస్తూ కమ్యూనిస్టు నాయకులు సంయుక్తంగా అభ్యర్థితో కలిసి బుధవారం రాత్రి పట్టణంలో ప్రచారం చేశారు. ప్రధాన వీధులతోపాటు ముస్లిం వీధి, ఆంధ్ర బ్యాంకు ప్రాంతం, జాతి రహదారి ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బాపిరాజు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకూ దేశం బహుముఖాలుగా అభివద్ధి చెందిందని కాంగ్రెస్ వల్లే అన్నారు. అదే స్థాయిలో దేశాన్ని అభివృద్ధి చేయడానికి తిరిగి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇవ్వాలని కోరారు. ఎంఎల్ఎ అభ్యర్థి వెంకట గోపాలకృష్ణం రాజును, ఎంపీ అభ్యర్థి బిటి.నాయుడుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పిసిసి ప్రధాన కార్యదర్శి జెఎస్ఆర్, మండల అధ్యక్షులు చింత ఆదిశేషు, సిపిఎం మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు, షేక్ వలీ, గేదెల జగదీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకొస్తే ప్రత్యేక హోదా

కాంగ్రెస్ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి సీతారామ్

భీమవరం రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇచ్చి తీరుతామని కాంగ్రెస్ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంకెం సీతారామ్ అన్నారు. బుధవారం భీమవరం రూరల్‌లోని దొంగపిండి, కొత్త పూసలమర్రు, జగన్నాధపురం, గూట్లపాడు, గొల్లవానితిప్ప, దెయ్యాలతిప్ప, నారాయణపురం, రామాయణపురం, దిరుసుమర్రు, యనమదుర్రు తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. కాలనీల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలలో ఇండియా వేదిక విజయం సాధిస్తుందన్నారు. బిజెపి పాలనలో ప్రజలకు భద్రత లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపన సుబ్రహ్మణ్య రాజు, సిపిఐ, సిపిఎం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, ఎం.వైకుంటారావు పాల్గొన్నారు.

కోర్టులో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని జిల్లా జడ్జి ఎస్‌కెఎస్.భాషా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులకు ఎంతో ఉపయోగకరమైన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన బార్ అసోసియేషన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎఎస్.సూర్య కిరణ్‌శ్రీ, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నమని, ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.అరుంధతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దూలం వెంకట విజయకుమార్, ఉపాధ్యక్షులు కంకట శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మల్లిడి గీతారెడ్డి, కోశాధికారి పి.రత్నదీప్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ నారాయణస్వామి, లైబ్రరీ సెక్రటరీ ఎం.శ్రీనుబాబు, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఎస్.విజయకృష్ణ, ఎం.శ్రీనివాసరావు,ఎ.దశరథరామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

పవన్‌కు అండగా నిలుద్దాం

సినీ నటుడు పృథ్వి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజల కోసం కోట్లాది రూపాయల ఆదాయం వదులుకుని, లగ్జరీ లైఫ్‌ను వీడి ప్రజాక్షేత్రంలోకి వచ్చిన పవన్‌కు అంతా అండగా నిలవాలని సినీనటుడు పృథ్వి కోరారు. బుధవారం పట్టణంలోని జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ సినిమాల్లోనే కాదు ఆయన వ్యక్తిగతంగా కూడా హీరోనేనని, వ్యక్తిగత విలువలు లేని వ్యక్తులు పవన్‌ను విమర్శించడం తనను బాధిస్తోందన్నారు. సొంతింట్లో వారికే న్యాయం చేయలేని జగన్ రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల కోసం తాము పోటీలో నిలుస్తున్నామని, వైసిపి అభ్యర్థులు ప్రజల సొమ్ము దోచుకునేందుకు, రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసేందుకు వస్తున్నారని తెలిపారు. తాడేపల్లిగూడెం వైసిపి అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అడుగడుగునా అవినీతితో ప్రజలను దోచుకున్నారన్నారు. ఆయన ఎవరి దగ్గర ఎంత సొమ్ము తీసుకున్నారో తమ దగ్గర ఆధారాలతో సిద్ధంగా ఉన్నాయన్నారు. తమకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సినీ నటుడు పృథ్వి


ప్రచారంలో పాల్గొన్న జానీ మాస్టర్

గణపవరంలో జానీ మాస్టార్ ప్రచారం

ప్రజాశక్తి - గణపవరం

జనసేన ఉంగుటూరు అభ్యర్థి పచ్చమట్ల ధర్మరాజుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బుధవారం స్టార్ క్యాంపెనర్ జానీ మాస్టర్ తెలిపారు. పిప్పర, గణపవరం, జగన్నాధపురం, చిన్న రామచంద్రపురం, చిలకంపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జానీ మాస్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గ్లాసు గుర్తుకు ఓటేసి పచ్చమట్ల ధర్మరాజును గెలిపించాలన్నారు. అలాగే ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ఎన్నికల గుర్తు సైకిల్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి మండలాల అధ్యక్షులు, జనసైనికులు పాల్గొన్నారు.

తనయుడితో ప్రసాదరాజు ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ మేలు చేకూరుతుందని చీఫ్‌విప్, ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని లక్ష్మణేశ్వరంలో ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రసాదరాజు, తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను పల్లె ముంగిటకు తీసుకొచ్చి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య వ్యవస్థకు బాటలు వేశారన్నారు. వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక స్థితిగతులు మారాన్నారు. ఈ కార్యక్రమంలో వేంద్ర వెంకటస్వామి, అంద్రాజు చల్లారావు, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పొన్నపల్లికి చెందిన మత్స్యకారులు 50 మంది బుధవారం వైసిపిలో చేరారు. టిడిపి, జనసేన పార్టీలకు చెందిన వారికి ముదునూరి ప్రసాదరాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భీమవరాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దా : గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరాన్ని అభివద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దానని, మరో అవకాశం ఇస్తే భీమవరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా నిలుపుతానని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని 36, 37, 38, 39 వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకారంతో భీమవరం పట్టణాన్ని దాదాపు రూ.130 కోట్లతో కేవలం 58 నెలల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. పట్టణంలో ఏ వార్డు చూసినా సీసీ రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధికి నిదర్శనంగా కనిపిస్తున్నాయన్నారు. భీమవరంలోని చివరి ప్రాంతాలకు సైతం తాగునీరు అందించాలనే లక్ష్యంతో పనులను వేగంగా పూర్తి చేశానని తెలిపారు. పట్టణంలో ప్రస్తుతం రెండు కోట్ల 80 లక్షల తాగునీటిని పుష్కలంగా అందిస్తున్నామన్నారు.

ఘనంగా కార్మికుల దినోత్సవం

ప్రజాశక్తి - యలమంచిలి

మేడేను పురస్కరించుకొని బుధవారం మండలంలోని యలమంచిలి, చించినాడ గ్రామాల్లో సిఐటియు ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మాజీ నాయకులు బాతిరెడ్డి జార్జి, కేతా సూర్యారావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాలరాజు, ఏడుకొండలు, సుధాకర్, మాసవరపు సుబ్బారావు, గబ్బుల చక్రపాణి, జి.ఆంజనేయులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్ : వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడేను వెంకట్రావుపాలెంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కండెల్లి సోమరాజు, పాలుపురి సత్యనారాయణ, జి.గంగారత్నం, చంద్రయ్య, తాడేపల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

పోడూరు : మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో మేడే వేడుకలు జిల్లా నాయకులు పిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ గ్రామాన జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమంలో బూరాబత్తుల వెంకట్రావు, కొప్పర్తి నరసింహమూర్తి, టి.గాంధీ, సి.ఆంజనేయులు, మూడే మోజేష్, డి.జ్యోతి, అమ్మాజీ, పిల్లి.నాగమణి, ఆర్.కుమారి, జె.ఉమాదేవి, కాటూరి.యాకోబు, జ్యోషి, క్రాంతికుమార్, ఎం.సీతయ్య, భాస్కరావు, వెంకటేశ్వరు పాల్గొన్నారు.


చించినాడలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

పథకాల చుట్టూనే అంతా

(మొదటి పేజీ నుంచి)

పరిహారం ఇస్తామని చెప్పినా నెరవేర్చలేదు. నూజివీడులో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు జరగలేదు. రోడ్లు బాగు చేయలేదు. ఏలూరు కాలువపై ఉన్న నారాయణపురం, గుండుగొలను వంతెనల నిర్మాణం జరగలేదు. కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామని చెప్పినా పట్టించుకోలేదు. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం చేయలేదు. ఇలా గత ఎన్నికల్లో ఇచ్చిన ఏఒక్క హామీ ఐదేళ్ల కాలంలో నెరవేరలేదు. గత ఎన్నికల సమయంలో ఏలూరులో పర్యటించినప్పుడు చేసిన ఏఒక్క వాగ్దానమూ నెరవేర్చలేదు. కనీసం ఈ ఎన్నికల్లో గెలిస్తే జిల్లాకు, నియోజకవర్గంలోని సమస్యలపై ఏం చేస్తారో ఒక్కమాట మాట్లాడకపోవడం అంతటా చర్చనీయాంశంగా మారింది. స్థానిక సమస్యలను ప్రస్తావించకపోవడంపై జనంలో చర్చ సాగింది. వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌కు ఓటు వేయాలని చెప్పి సిఎం తన ప్రసంగం ముగించేశారు.

పారదర్శకంగా ఇవిఎంల రెండో ర్యాండమైజేషన్

(మొదటి పేజీ నుంచి)

ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించామన్నారు. ఏలూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలస్థాయిలో ఇవిఎంల ర్యాండమైజేషన్ పూర్తయ్యిందన్నారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఒక అనుబంధ పోలింగ్ స్టేషన్‌తో కలిపి 1,744 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గంలో 286, పోలవరం నియోజకవర్గంలో 284, చింతలపూడిలో 273, దెందులూరులో 239, కైకలూరులో 235, ఉంగుటూరు నియోజకవర్గంలో 214, ఏలూరు నియోజకవర్గంలో 213 పోలింగ్ కేంద్రాలవారీగా ఆన్‌లైన్ ద్వారా ఇవిఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, నోడల్ అధికారి కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఎన్‌ఐసి అధికారి శర్మ తదితరులు పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య హత్య

(మొదటి పేజీ నుంచి)

సంవత్సరాలుగా ఝాన్సీకి చెందిన ఇంటిని విక్రయించాలని వంశీ తరచూ గొడవపడుతున్నాడు. ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చి బయట ఆడుకోవాలని బయటికి పంపి, తలుపులు గడియపెట్టి లోపల ఘర్షణ పడ్డారు. పదునైన ఆయుధంతో ఝాన్సీపై వంశీ దాడి చేసి పరారయ్యాడు. దీంతో ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది. అక్కడ నుంచి వంశీ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మేడే వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ళ

కార్మికుల రక్తంతో తడిసినదే ఎర్రజెండా అని, కార్మికుల ప్రాణాలు ఫలితంగానే మేడే ఏర్పడిందని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు అన్నారు. మండల కేంద్రమైన కాళ్ళలో సిఐటియు ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా బుధవారం నిర్వహించారు. అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పసుపులేటి సత్యనారాయణ, వడ్డీ ఏసురాజు, బోలిశెట్టి చినగణేష్ పాల్గొన్నారు.



వీరవాసరంలో..

పెనుమంట్ర: ప్రపంచ కార్మికులని ఏకం చేసి నడిపించిన మేడే కార్మిక, కర్షక జనానికి ఎప్పుడూ ప్రతేకమైనదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఆకుల హరేరామ్ అన్నారు. బుధవారం మండలంలోని పెనుమంట్ర, బ్రాహ్మణ చెర్వు సెంటర్లలో, సివిల్ సప్లయ్ గోడవున్, బియ్యం మిల్లు, అంగన్వాడీ సెక్టార్‌లలో జరిగిన మేడే వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సివిల్ సప్లై గోడవున్ వద్ద మేస్త్రి గంటి ఆంజనేయులు, సెంటర్‌లో మాదాసు లక్ష్మణరావు, అంగన్వాడీ ఆలమూరు సెక్టార్ వద్ద నేతల నాగమణి పతాక ఆవిష్కరణ చేశారు. మార్టేరు వ్యవసాయ పరిశోధనాస్థానంలో పలువురు వ్యవసాయ కార్మికులు, పెనుమంట్రలో జట్టు కార్మికులు, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు ఎండను లెక్కచేయకుండా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, సిఐటియు మండల కార్యదర్శి కోడె శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

మండలంలోని పొలమూరులో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కేతా గోపాలన్, రపాక ఆశీర్వాదం, చింతపల్లి సత్యనారాయణ, పంచాయతీ స్వీపర్స్ బంగారు నరసమ్మ, బంగారు రాము, బంగారు రాయుడు, సిపిఎం పొలమూరు శాఖ సభ్యులు కముజు ప్రసాద్, పిల్లి సాయి, పిల్లి రాజారావు, చింతపల్లి తిరుమల, పంపన సూర్యనారాయణ, కట్ట సత్యనారాయణ, వైసిపి నాయకులు చింతపల్లి గురుప్రసాద్, టిడిపి నాయకులు చింతపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు

తాడేపల్లిగూడెం: మేడే సందర్భంగా రైల్వే గూడ్ షీట్ వర్కర్స్ యూనియన్ వద్ద యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ ప్రధాన కార్యదర్శి చర్ల పుల్లారెడ్డి, తేతల నాగిరెడ్డి మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలకు బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని, వాటిని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయి రెడ్డి, ఎస్ఎస్.రెడ్డి, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

వీరవాసరం: మండలంలో మేడే వేడుకలు ఘణంగా నిర్వహించారు. వీరవాసరంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పశ్చిమ కాలువ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పోతుల మృత్యంజయ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఇదేవిధంగా పెర్కిపాలెం, మత్స్యపురిలో ప్రజా సంఘాల అధ్వర్యంలో జెండా అవిష్కరించారు. వీరవాసరం మండల భవణనిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, మేడే వేడుకలు ఘణంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జుత్తిగ నరసింహమూర్తి, బొక్కా కూర్మారావు, బొర్రా ఆలమహారాజు, బండి శ్రీనివాసరావు, సీరాపు లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

గణపవరం: మేడే సందర్భంగా మండలంలోని గణపవరం, కేశవరం, అప్పన్నపేట, కాశిపాడు, కోమర్రు, పిప్పర గ్రామాల్లో జెండా ఆవిష్కరణ జరిగినట్లు సిఐటియు మండల కార్యదర్శి ఎం.పెంటారావు, నాయకులు పి.నరశింహమూర్తి బుధవారం తెలిపారు. మండల కేంద్రం గణపవరంలో సిఐటియు కమిటీ ఆధ్వర్యానా స్తానిక కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయుకులు గుత్తుల శ్రీను, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.




ఆచటంలో ర్యాలీ

మొగల్తూరు: మండలంలోని గ్రామాలలో మేడే దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తలగంశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో మొగల్తూరులోని సిఐటియు కార్యాలయంలో ఆదూరి సాంబమూర్తి, గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో వీర పాండు రంగారావులు సిఐటియు పతాకాలు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో జి.పెద్దింట్లు, ఎ.సీత, రేఖ శాంభవి, రంగశెట్టి అర్జున్ రావు పాల్గొన్నారు.

ఆచంట: మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కులను ఐఖ్యంగా పరిరక్షించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి కార్మికులకు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా స్థానిక ముత్యాలమ్మ చెరువుగట్టు వద్ద గల భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పూసల ఏడుకొండలు సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా నాగాంజనేయులు, బొంతు శ్రీను, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రపంచ కార్మికుల పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తోన్న హక్కుల దినం మేడే అని సిపిఎం సీనియర్ నాయకులు తోటపల్లి సత్యన్నారాయణ అన్నారు. మేడే సంధర్భంగా స్థానిక సంతమార్కెట్ వద్ద గల అమరవీరుల భవనం వద్ద సత్యన్నారాయణ పతాకాన్ని ఆవిష్కరించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నర్సింహమూర్తి, ఎస్‌విఎన్.శర్మ, కుసుమే జయరాజు పాల్గొన్నారు.



తణుకురూరల్: మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలో మేడే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బంగారుగూడెం, వీరంపాలెం, వెంకట్రావుపాలెం, కొమ్ముగూడెం, మాధవరం గ్రామాల్లో బిల్డింగ్ వర్కర్స్, స్కీమ్ వర్కర్స్ ఆధ్వర్యంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, రైతు సంఘం మండల నాయకులు పాలుపూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండ: సిఐటియు అనుబంధ సంఘాలైన అంగన్వాడీ, ఆశ, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ కార్మికులు పెనుగొండలో మేడే ప్రదర్శన నిర్వహించారు. బుధవారం పెనుగొండ పార్క్ సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ప్రదర్శన నిర్వహించి వాసంశెట్టి వీరన్న స్థూపం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సిర్ర మహాలక్ష్మి, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొంబత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మేడే జెండా ఆవిష్కరణలు పెనుగొండ సిపిఎం ఆఫీస్, గోంగూర తూము సెంటర్, స్థానిక బస్టాండ్ వద్ద జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్, రిక్షా కార్మికులు, సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, పులిదిండి రామారావు, నీలాపు ఆదినారాయణ, నాగిశెట్టి గంగారావు, శీలం ఏసు, రాజమహేంద్రవరపు వెంకటేష్ పాల్గొన్నారు.

ఉండి: సిఐటియు ఆధ్వర్యంలో ఉండి మెయిన్ సెంటర్‌లో మేడే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు డి.కళ్యాణి అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం సిఐటియు నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనకొండ శ్రీనివాస్, నాయకులు చీరల శేషు, వీరవల్లి మాధవరావు పాల్గొన్నారు.

తణుకు: మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కులు, చట్టాల పరిరక్షణకు సంఘటిత పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోణాల భీమారావు అన్నారు. బుధవారం వంక సత్యనారాయణ స్వరాజ్య భవనం వద్ద ఎఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొద్దాని నాగరాజు, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి సిగ్గులే పుష్పకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులు బాధ్యతాయుతంగా మెలగాలి

సిఐ సత్యనారాయణ సూచన

ప్రజాశక్తి - ఆకివీడు

రానున్న ఎన్నికల్లో విద్యార్థులు సహనంతో, ఓపికగా సేవలందించాలని ఆకివీడు సిఐ కెవిఎన్ సత్యనారాయణ ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలీసులకు ఎన్నికల విధులలో సహకరించేందుకు గాను నిర్వహించిన ప్రత్యేక సూచన, శిక్షణ శిబిరం మండలంలోని దుంపగడప, వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందించే సేవలు, సహకారాలు అందరికీ ఉపయోగపడాలని అన్నారు. సమస్యాత్మకంగా ఉన్న ప్రతి ఓటరుకు సహకారం అందించవచ్చున్నారు. నిర్ణయాత్మకమైనటువంటి విధానంలో ముందుకు నడవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శారదా, పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ పి.నాగబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

పోస్టల్ శాఖలో సర్వారాయుడు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పోస్టల్ శాఖలో 37 ఏళ్ల పాటు పోస్టల్ ఉద్యోగిగా, పోస్టల్ అసిస్టెంట్‌గా వినుకొండ సర్వారాయుడు అందించిన సేవలు ప్రశంసనీయమని భీమవరం డివిజనల్ సీనియర్ సూపరిటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఎన్‌వి.సత్యనారాయణ రాజు అన్నారు. పాలకొల్లు హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా పనిచేసిన వినుకొండ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాలకొల్లు హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో మంగళవారం రాత్రి జరిగిన పదవీ విరమణ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పోస్టల్ శాఖలో సర్వారాయుడు ఖాతాదారులకు ఉత్తమమైన సేవలందించి, ఆయా గ్రామాల్లో ప్రజల మన్ననలు పొందారన్నారు. అనంతరం సర్వారాయుడు, హరిప్రియ దంపతులను పోస్టల్ శాఖ ఉన్నత ఉద్యోగులు, ఉద్యోగులు, సిబ్బంది, బంధువులు, మిత్రులు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ డిప్యూటీ సూపరిటెండెంట్ అల్లు సురేష్, ఎఎస్‌పి సుబ్రహ్మణ్యం, పోస్టల్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యాన వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెనుమంట్ర శాఖ తరుపున ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ఈనెల 2 నుంచి వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, బండి ప్రసాద్ తెలిపారు. బుధవారం వేసవి శిక్షణా తరగతుల పోస్టర్‌ను మండలశాఖ ప్రతినిధులు విడుదల చేశారు. ఈ వేసవిలో విద్యార్థులను ఆహ్లాదకరమైన వాతావరణంలో వివిధ రకలైన అంశములలో శిక్షణ ఇప్పించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో మానసిక, శారీరక, సాంఘిక విలువలను పెంపొందించడం కోసం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, కో ఛైర్మన్ పడాల జగన్నాథ రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గణపవరం: ఆటో వర్కర్స్ ఆటో తోలుకొని తమ జీవితాలను గడుపుకోవడంతో పాటు సమాజ సేవలో కూడా భాగం పంచుకోవడం కోసం బుధవారం గణపవరంలో ప్రసన్న ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటోఓనర్లు, డ్రైవర్లు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు దేవదాస్ కుటుంబరావు ప్రారంభించారు. కుటుంబరావు మాట్లాడుతూ వేసవిలో బాటసారులకు దాహార్తిని తీర్చడానికి తమ కర్తవ్యంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్: ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 16 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో రక్తదాతల కొరత ఏర్పడుతుందని, కాబట్టి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా గుర్తింపు పొందిన బ్లడ్ సెంటర్లలో రక్తదానం చేసి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేబి.సీతారాం, డాక్టర్ స్పందన పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులు నీట్ అకాడమీకి ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్: ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్సిట్యూషన్ సొసైటీ వారు నిర్వహించిన పరీక్షల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం పెత్తాడేపల్లికి చెందిన 22 మంది విద్యార్థులకు ఐఐటి, నీట్ అకాడమీలో ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు కర్నూల్‌లోని చిన్నటెకురు, గుంటూరులోని అడవితక్కెళ్లపాడులో ఇంటర్ మీడియట్‌తో పాటు ఐఐటి, నీట్ శిక్షణ ఇస్తారని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతే వ్యాధులకు అడ్డుకట్ట

తాడేపల్లిగూడెం: దోమ తెరలు వాడుదాం దోమకాటు నుంచి రక్షణ పొందుదాం, ఫ్రై డే డ్రై డేలో ప్రజల భాగస్వామ్యంతో దోమల ద్వారా వచ్చే వ్యాధుల నియంత్రణకు అడ్డుకట్ట వెయ్యొచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి లక్ష్మణరావు అన్నారు. బుధవారం పట్టణ ఆరోగ్యకేంద్రం వీకర్స్ కాలనీ పరిధిలోని 1, 2 వార్డుల్లో జరుగుతున్న కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. దోమల నియంత్రణ అందరి భాద్యతన్నారు.

రాజ్యాధికారం కార్మికవర్గ చేతుల్లోకి రావాలి : బలరాం

ప్రజాశక్తి - ఆకివీడు

రాజ్యాధికారం సామ్రాజ్యవాద శక్తుల చేతుల నుండి కార్మికవర్గం చేతుల్లోకి రావాలని, అప్పుడే 80 శాతం ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు సీనియర్ నాయకులు బలరాం అన్నారు. మేడే కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక వెలమపేట రామాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు మండల అధ్యక్షులు పెంకి అప్పారావు అధ్యక్షత వహించారు. బలరాం మాట్లాడుతూ సంపదను సృష్టించడమే కాదు, సృష్టించిన సంపదను కార్మికులు అనుభవించే పరిస్థితి రావాలని అన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా ఇప్పటికే ప్రపంచంలో క్యూబా, రష్యా, చైనా, వియత్నాం, కొరియా దేశాల్లో కార్మిక ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. కమ్యూనిస్టు దేశాల్లో మాత్రమే కార్మికులకు తగిన గౌరవం లభిస్తుందన్నారు. కార్మికులు ఇప్పటికైనా మేల్కొనకపోతే తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మెరుగైన జీవనం కోసం కార్మికుల హక్కులు కాపాడుకోవడం కోసం మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల కోసం సర్వం త్యాగం చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని బలరాం కొనియాడారు. సుందరయ్య జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు.

మేడే స్ఫూర్తితో పోరాడాలి: రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మేడే స్ఫూర్తితో దేశంలో మతోన్మాద, ప్రయివేటీకరణ విధానాలపై పోరాడాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బి.సోమయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో రవి మాట్లాడారు. శ్రామిక వర్గం లేకపోతే ఈ సమాజంలో ఎవరికి తిండి, బట్ట, నివాసం తదితర సౌకర్యాలు దొరకవన్నారు. అటువంటి శ్రామిక శక్తికి నిదర్శనమే మేడే అన్నారు. మన దేశంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాద, ప్రయివేటీకరణ విధానాలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రశ్నిస్తే వారిపై దేశద్రోహం కేసులు పెట్టి విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, కవులు, రచయితలు, జర్నలిస్టులను అరెస్టు చేసి జైల్లో పెట్టిందన్నారు. అటువంటి బిజెపిని ఈ ఎన్నికల్లో మేడే స్ఫూర్తితో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సిఐటియు నాయకులు బి.జగన్నాథరావు, వివివిఎన్ ప్రసాద్, టిపిఆర్ దొర తదితరులు పాల్గొన్నారు.

పత్తేబాధ మరకవారి వీధి సెంటర్లో సిపిఎం సెంటర్ శాఖ ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. సిపిఎం పతాకాన్ని జిల్లా కేంద్రం శాఖ కార్యదర్శి పి.ఆదిశేషు ఆవిష్కరించారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన మేడే వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం

యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద మేడే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ పతాకాన్ని రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు సిహెచ్.పట్టాభిరామయ్య అధ్యక్షత వహించగా గోపీమూర్తి మాట్లాడారు. ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.రామకృష్ణంరాజు, సిహెచ్.కుమారబాబ్జి, జెవివి జిల్లా అధ్యక్షులు సిహెచ్.ప్రసాదరావు, నాయకులు బి.నాగబాబు, వివిఎస్‌పి.శ్రీనివాస్, కె.వామనమూర్తి, కె.రవిచంద్రకుమార్, ఎం.శివరామరాజు, ఎ.లక్ష్మీనారాయణ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.



వాడవాడలా మేడే పతాకావిష్కరణలు



భీమవరంలో..

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కేంద్రమైన భీమవరంలో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కార్మికులు వేలాదిమంది తరలొచ్చారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి చేపట్టిన భారీ ర్యాలీలో రైస్‌మిల్లు, బజార్ జట్టు, లాగుడు బళ్ల కార్మికులు, గ్యాస్ వర్కర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, మెడికల్ రిప్‌లు, భవన నిర్మాణ కార్మికులు, పలు సంఘాలు, అసోసియేషన్ల కార్మికులు వందలాది మంది ర్యాలీలో భాగస్వాములయ్యారు. ర్యాలీ యుటిఎఫ్ జిల్లా కార్యాలయం మీదుగా మావుళ్లమ్మ గుడి రోడ్డు, ప్రకాశం చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, నటరాజ్ థియేటర్, వెంకటేశ్వరస్వామి గుడి, బొంబాయి స్వీట్స్ మీదుగా అంబేద్కర్ సెంటర్, పోలీస్ బొమ్మ సెంటర్, అన్నపూర్ణ థియేటర్ రోడ్డు మీదుగా కొత్త బస్టాండ్ వరకు సాగింది. తీన్మార్ డప్పులు, డిజె శబ్దాలు, కార్మికుల నినాదాలతో భీమవరం పట్టణం మార్మోగింది. ఉద్యమ గేయాలకు కార్మికులంతా ఉత్సాహంగా డ్యాన్స్‌లు చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మేడే స్ఫూర్తితో ఇంటికి సాగనంపుతామని చేసిన నినాదాలు హోరెత్తాయి. ఈ సందర్భంగా స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పట్టణ నేత బి.వాసుదేవరావు అధ్యక్షత వహించగా పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ 74 ఏళ్ల స్వాతంత్రకాలంలో ఎన్నడూ లేనివిధంగా మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిందన్నారు. 44 కార్మిక చట్టాలను యధాతథంగా కొనసాగించాలని, లేనిపక్షంలో ఐక్య పోరాటాలు చేసేందుకు సిద్ధమని హెచ్చరించారు. మూడేళ్లలో జిల్లాలో పది వేల మంది కార్మికులు రోడ్డునపడ్డారని చెప్పారు. ఏలూరు జ్యూట్‌మిల్లు, పేపర్‌మిల్లు, ఆంధ్రా సుగర్స్, వేంద్ర డెల్టా పేపర్‌మిల్లు, గణపవరం సిపిఎఫ్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలు రియల్ ఎస్టేట్ చేసుకుంటూ కార్మికులను నడిరోడ్డు మీద నిలబెట్టారన్నారు. జిల్లాకు చెందిన ఒక్క ఎంపీగాని, ఎంఎల్ఎగాని, మంత్రిగాని కనీసం మాట్లాడుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు చైతన్యప్రసాద్ విప్లవ గీతాలు ఆలపించారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, మెడికల్ రిప్రజెంటేటివ్స్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లా డారు. కార్యక్రమంలో సంఘాల నేతలు పట్టాభిరామయ్య, కె.సత్యనారాయణ, ఎస్.శిరీష్, సిహెచ్.వెంకటేశ్వరరావు, నీలాపు రాజు, బంగారు వరలక్ష్మి, ఎస్.సత్యనారాయణ, డి.నాగేశ్వరరావు, బంగారు గణేష్, ఎస్.శ్రీనివాస్, గురుప్రసాద్, రంగారావు, డి.సీతారామయ్య, సిహెచ్.మహాలక్ష్మి, రాజేశ్వరి, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: సిఐటియు ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకత్వాన నగరంలోని 60 కేంద్రాల్లో మేడే ఉత్సవాలు నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యాలయం అల్లూరు సత్యనారాయణ భవనం వద్ద మేడే పతాకాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య ఆవిష్కరించారు. ఏలూరు, కొత్తూరు జ్యూట్‌మిల్లుల వద్ద సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు, ముఠా వర్కర్ల ఆధ్వర్యాన రామ్మూర్తి, అప్పారావు నాయకులు మేడే జెండాలు ఎగురవేశారు. ఆర్‌టిసి ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో జెండాను సిహెచ్.సుందరయ్య, టికె.రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జానుబాబు, నాగరాజు, వెంకటేశ్వరరావు, దుర్గారావు, హనుమంతరావు, గోపీ, లావేటి కృష్ణారావు, కాంతమ్మ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సూరిబాబు, గోపీ, సత్యనారాయణ, ఆంజనేయులు, మెడికల్ రిప్స్ ఆధ్వర్యంలో వివిఎన్.ప్రసాద్, ఎల్ఐసి ఏజెంట్స్ ఆధ్వర్యంలో వైఎస్.కనకారావు, అంగన్వాడీల ఆధ్వర్యంలో వెంకటలక్ష్మి, ఆర్‌పిల ఆధ్వర్యంలో ఇందిర, ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిహెచ్.దేవి, బిల్డింగ్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాంబాబు, శ్రీనివాసరావు, సాంబశివరావు మేడే జెండాలను ఆవిష్కరించారు. ఐఎఫ్‌టియు అనుబంధ ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే జెండాలు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభకు యూనియన్ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు.

తాడేపల్లిగూడెం: కార్మికుల శ్రమ లేనిదే పెట్టుబడిదారులకు సంపద లేదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌కె గ్రౌండ్‌లో పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను అధ్యక్షతన మేడే సభ నిర్వహించారు. ముఖ్యవక్త ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడారు. కరోనా కాలంలో కార్మికులు ,పేదలు అనేక ఇబ్బందులకు గురైతే వారిని ఆదుకోకుండా, దేశంలో పెట్టుబడిదారుల సంపదను మరింతగా పెంచడానికి మోడీ ప్రభుత్వం కృషి చేసిందని విమర్శించారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచిందన్నారు. ఈ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, నాయకులు మడక రాజు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, సత్తి కోదండరామిరెడ్డి, గొర్రెల సతీష్‌కుమార్, ధనాల వెంకట్రావు, జగ్గు నిరంజన్‌రామారావు, నరమాల కృష్ణ, మేట్రేటి రమణ, కుంచంగి నానాజీ, పోతు శ్రీను, పులిమంతుల రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో కార్మికులు, ఉద్యోగులు ఎన్‌కె గ్రౌండ్ నుండి ఆర్‌టిసి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

భీమడోలు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మేడే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అర్జావారిగూడెం ఆవాస ప్రాంతం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పాల్గొని మాట్లాడారు. మండల అధ్యక్షురాలు స్వర్ణకుమారి జెండా విష్కరణ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.ప్రసాదరావు పాల్గొన్నారు. భీమడోలు రైస్‌మిల్లు, పూళ్ల, పాతూరు గోదాముల వద్ద, తిరుమల మిల్క్‌ఫ్యాక్టరీ వద్ద మేడే కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కె.వెంకటేశ్వరరావు, దుర్గారావు, బెండి శ్రీను పాల్గొన్నారు.

తణుకు రూరల్: కార్మికుల హక్కులు, శ్రమను గౌరవించని వారిని రానున్న ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని సిఐటియు సీనియర్ నాయకులు చింతకాయల బాబూరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ వద్ద నుండి సిఐటియు ఆధ్వర్యంలో వెంకటేశ్వర సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్, నరేంద్ర, కోర్టు మీదగా మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద సభలో బాబూరావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా 80 శాతంగా ఉన్న కార్మికులు, కర్షకుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, యూనియన్ల నేతలు వి.వెంకటేశ్వరరావు, రమేష్, నళిని, కొల్లి శ్రీనివాస్, ఎ.సూర్యనారాయణ, హర్షవర్ధన్, పద్మారావు, గార రంగారావు మాట్లాడారు. హెచ్‌పి గ్యాస్, సీడ్స్, ఎస్‌డబ్ల్యూసి, సివిల్ సప్లయీస్, డిఒసి, మున్సిపల్ కార్యాలయం, అమర వీరుల భవనం వద్ద, ఇండస్ట్రీస్‌లో జెండా ఆవిష్కరణలు నిర్వహించారు.

చింతలపూడి: కార్మిక చట్టాలు మార్చి తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మిక వర్గం పెద్దఎత్తున పోరాటం చేయాలని సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. చింతలపూడి మండలం సీతానగరంలోని గోద్రెజ్ ఆగ్రోవెట్ ఎంప్లాయీస్ యూని యన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మేడే పతాకాన్ని ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఫ్యాక్టరీల్లో కార్మికుల భద్రతకు యాజమాన్యాలు సరైన చర్యలు చేపట్టాలన్నారు. సంవత్సరాలు తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ యూనియన్ అధ్యక్షుడు పి.బాలకృష్ణ, కార్యదర్శి పి.పెద్దిరాజు, కోశాధికారి నత్త వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్: సిఐటియు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన పట్టణంలో మున్సిపల్ కార్యాలయం, బుట్టాయగూడెం, ఏలూరు రోడ్డులోని ప్రజాసంఘాల స్తూపాల వద్ద జెండావిష్కరణలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద నుండి బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి అధ్యక్షత వహించగా పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడారు. అనంతరం బస్టాండ్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్.మాణిక్యాల రావు, కె.సుబ్బారావు, పి.చంటి, ఆటో వర్కర్స్ బి.నాని, సత్తిబాబు, రైతుసంఘం నాయకులు బి.రాంబాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ పాల్గొన్నారు.


చింతలపూడిలో

పాలకొల్లు: పట్టణంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత సిపిఎం కార్యాలయం వద్ద మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ జెండా ఎగురవేశారు. సిఐటియు జెండాను వీరవల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం వీవర్స్ కాలనీ నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, చల్లా సోమేశ్వరరావు, ఎస్.పురుషోత్తం, ఆకుల ప్రసాద్, తమ్మా సూర్యారావు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. వీవర్స్ కాలనీలో జెండాను అరటకట్ల నారాయణమ్మ ఆవిష్కరించారు. కార్మిక పని ప్రదేశాల్లో జెండాలు ఆవిష్కరించారు.

మేడే సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సారథ్యంలో కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన ముందు ఎంఎల్ఎ నిమ్మల సైకిల్ తొక్కుతూ పలువురిని ఆకర్షించారు.

పాలకోడేరు: మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేపట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. పాలకోడేరు రావి చెట్టు సెంటర్ నుంచి సొసైటీ బ్యాంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సిఐటియు మండల అధ్యక్షురాలు ఎస్.లారెన్స్‌కుమారి అధ్యక్షత వహించగా గోపాలన్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లగా సాధించుకున్న హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని, ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నేత ఎస్.అశ్రియ్యా, కలిదిండి గోపాలరాజు, దున్న మరియమ్మ, పి.జాస్మిన్, కార్మికులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: పట్టణంలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో మేడే బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి, మున్సిపాల్టీ, కార్పెంటర్ వర్కర్స్, ఆశ, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, పట్టణాధ్యక్షులు ఎన్‌ఆర్.హనుమాన్లు, నేతలు దుర్గారావు, వసంతరావు, బేబీ మేరీ, రాణికృష్ణ, నాగూర్‌నాయుడు, నాగు శివ, రాజేశ్వరరావు, రాంబాబు, రాజేష్, కమల, నాగమణి, స్వాతి, జయలక్ష్మి, రాణి, గోపీచంద్, చంద్రశేఖర్, రజిత పాల్గొన్నారు.

నరసాపురం: పాలకవర్గాలు 44 లేబర్ చట్టాలు రద్దుచేసి యాజమాన్యాలకు అనుగుణంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమని కార్మిక నేతలు అన్నారు. పట్టణంలోని స్థానిక మీరా గ్రంథాలయ ప్రాంగణంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు పొన్నాడ రాము అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. తొలుత కార్మికోద్యమ నేత మీరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కౌరు పెద్దరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. అనంతరం కార్మికులు, హమాలీలు, అంగన్వాడీలు అంబేద్కర్ సెంటర్ నుండి శివాలయం సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, మత్స్యకార సంఘం జిల్లా కార్యదర్శి జల్లి రామ్మోహన్, నాయకులు రామలింగం పాల్గొన్నారు. మండలంలోని పెదమైనవానిలంక గ్రామంలో మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు జెండాను ఎగురవేశారు.